క్లుప్తంగా

రేపు కౌన్సిల్ సాధారణ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలోని 13 అంశాలను పొందుపరిచారని, వాటిపై చర్చించి ఆమోదించడానికి సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

3న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామాల సందర్శన

పెడన: మండలంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామాలుగా ఎంపికైన నందమూరు, మడక గ్రామాల్లో పర్యటించడానికి కేంద్ర బృందం జూలై 3వ తేదీన రానుందని ఎంపీడీవో ఎ.అరుణకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు నందమూరులోని ఫారెస్ట్ నర్సరీ, మినిగోకులాలను సందర్శిస్తారని, అనంతరం మడక గ్రామంలో హార్టికల్చర్‌ను పరిశీలిస్తారని ఆమె తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత మచిలీపట్నంలో లంచ్ చేసిన తర్వాత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి గూడూరు మండలం మల్లవోలు గ్రామంలో ఫాం బాండ్, అమృత సరోవర్‌లను పరిశీలిస్తారని ఆమె పేర్కొన్నారు.

రేపు గణపేశ్వరంలో ఆషాఢ వేడుక

గణపేశ్వరం(నాగాయలంక): ఆషాఢ మాసం పురస్కరించుకుని గ్రామంలోని చారిత్రిక ప్రసిద్ధి చెందిన దుర్గా–గణపేశ్వరస్వామి ఆలయంలో శ్రీకనకదుర్గాదేవికి సోమవారం ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం భక్త బృందం శనివారం తెలిపారు. స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యురాలు తలశిల స్వర్ణలత, లేబాక పద్మప్రియ నేతృత్వంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'హంసలదీవి'



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో నిర్వహించిన పాలకాయతిప్ప ప్రీమియర్ లీగ్ మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా 'హంసలదీవి' జట్టు నిలిచింది. 20 రోజుల నుంచి హంసలదీవి బీచ్ వద్ద క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి, సీహెచ్ బాలయ్య, పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

బృహత్ వారాహిగా దుర్గమ్మ



నాగాయలంక: కృష్ణానదీ తీరం శ్రీరామ పాదక్షేత్రంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న ఆషాఢ గుప్త నవరాత్రి ఉత్సవాల్లో శనివారం అమ్మవారు బృహత్ వారాహిదేవి అలంకారంలో పూజలందుకున్నారు. ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాస శాస్త్రి, అచ్యుత శేఖరశర్మ బ్రహ్మత్వంలో ప్రాతఃకాలంలో వారాహి మాతకు శాస్త్రోక్త పూజ జరిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ముఖ మండపంలో అమ్మవారి పీఠం వద్ద వెల్లంపల్లి కళ్యాణ్–రజని దంపతులు పీటలపై పూజలు నిర్వహించారు. తొలుత ప్రధాన ఆలయం లోని శ్రీకనకదుర్గమ్మకు అర్చకుడు శ్రీనివాసశాస్త్రి విశేష పూజ జరిపారు. శ్రీరామక్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్(బుజ్జి) కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు స్వాధీనం



బంటుమిల్లి: పెందుర్రు గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న 7 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు శనివారం జరిమాన విధించారు. మట్టి మాఫియా రెండు వర్గాలు రాత్రి, పగలు అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున మట్టి తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు దాడులు చేసి 7 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లకు ఒక్కొక్కదానికి రూ. 1500 చొప్పున జరిమాన విధించి మట్టిని కార్యాలయ ఆవరణలో అన్‌లోడ్ చేయించారు.

శిథిలావస్థకు రెగ్యులేటర్

- గంజివాని పాలెం వద్ద ఉనికి కోల్పోయే 11వ నంబర్ కాలువ రెగ్యులేటర్
- సాగు, తాగునీరు ప్రశ్నార్థకం
- రెండు షట్టర్లు మాయం
- పునాదులు బీటలు వారే ప్రమాదం



గంజివానిపాలెం రెగ్యులేటర్ వద్ద మాయమైన షట్టర్లు

గంజివానిపాలెం(మోపిదేవి): రెగ్యులేటర్ ఉనికి నికోల్పోయే దుస్థితిలో కనిపిస్తోంది. ఇది శిథిలావస్థకు చేరడంతో సాగు, తాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఈ కాలువ దిగువనున్న రైతులు సాగు చేయడానికి భయపడుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని మోపిదేవి శివారు గంజివానిపాలెం వద్ద కెఈజీ కెనాల్ సమీపంలోని 11వ నంబర్ కాలువపై 1960 దశకంలో రెగ్యులేటర్ నిర్మించారు. అయితే ఇది శిథిలావస్థకు చేరింది. వాటికి ఏర్పాటు చేసిన రెండు షట్టర్స్ మాయం కావడంతో కెఈబీ కెనాల్ నుంచి వచ్చే నీటిని నిలుపు అవకాశం లేకపోయింది. దీంతో కేఈబీ కెనాల్, అధిక వర్షాల నుంచి వచ్చే నీరు పొలాల్లోకి వెళ్లి తరచూ పంట ముంపునకు గురవుతోందని ఆవేదన చెందుతున్నారు.

భారీ గండి

గతంలో సాగునీరు అందక కాలువ దిగువనున్న రైతులు రెగ్యులేటర్‌కు భారీ గండి కొట్టారు. దీంతో రెండు షట్టర్స్ కోల్పోవడంతో పాటు, భారీ గండితో మూడు ఖాళీ(గుంత)లు ఏర్పడ్డాయి. కేఈబీ నుంచి వచ్చే నీటిని అదుపు చేయడానికి అవకాశం లేకపోయింది.



రెగ్యులేటర్ పక్కన ఏర్పడిన గండి

సాగు ప్రశ్నార్థకం

ఇలా మూడు గుంతలతో రెగ్యులేటర్ పునాదులు కూడా దెబ్బతిన్నాయి. ఎప్పుడు కూలిపోతుందోనని రైతులు భయపడిపోతున్నారు. అదే జరిగితే కాలువ కింద సాగవుతున్న సుమారు 8 వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్ సాగు ప్రారంభించకముందే ఈ రెగ్యులేటర్‌కు రెండు షట్టర్స్ ఏర్పాటు చేసి కొట్టిన గండిని పూడ్చించాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే ఈ కాలువ కింద సాగు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి షట్టర్స్ ఏర్పాటు చేయాలని దిగువ ప్రాంత రైతులు కోరుతున్నారు.

మూడు నెలల క్రితమే పంపాం

ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ రవితేజను సంప్రదించగా అంచనాలు వేసి మూడు నెలల క్రితం ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపామని, అనుమతులు రాలేదని తెలిపారు. గతంలో కూడా ప్రపోజల్స్ పంపగా తిరిగి పంపినట్లు వివరించారు. నిధులు రాకపోతే చేయలేమని సమాధానం ఇచ్చారు.

పరిసరాల పరిశుభ్రతకు చర్యలు



మడక ఎంపీపీ స్కూలులో వంటషెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో అరుణకుమారి

పెడన: గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని.. ఎంపీడీవో ఎ.అరుణకుమారి ఆదేశించారు. శనివారం ఆమె డిప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడ్డితో కలిసి మడక గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఓవర్‌హెడ్ ట్యాంకు, చెత్త సంపద కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద చెట్లను, పిచ్చిమొక్కలను తీయించాలని సూచించారు. చెత్త సంపద కేంద్రం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. వంటషెడ్ నిర్వహణ, విద్యార్థుల హాజరు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు పంచాయతీ కార్యదర్శి అనురాధ తదితరులున్నారు.

సేవే ఊపిరిగా ముందుకు..

మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు



పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: సామాజిక సేవా కార్యక్రమాలే ఊపిరిగా ముందుకు సాగుతామని మైత్రి ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు ఏఆర్‌కే వరప్రసాద్ అన్నారు. ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం శనివారం స్థానిక షార్కీ బాలకల హాస్టల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని 12 ఉన్నత పాఠశాలల్లో టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు రూ. 3 వేల చొప్పున నగదు బహుమతులు, ఓ పేద విద్యార్థినికి రూ. 5 వేల నగదును అందజేశారు.

250 మంది విద్యార్థులకు రూ. లక్ష విలువైన నోట్ పుస్తకాలను అందజేశారు. వరప్రసాద్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, పేద విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు పంపిణీ, అనారోగ్య పీడితులకు ఆర్థిక సాయం వంటి సేవా కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహించినట్లు తెలియజేశారు. ఫౌండేషన్ కార్యదర్శి డి.రాధాకృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, స్టార్ కళాశాల డైరెక్టర్ శ్రీరామ్, స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు నంగేగడ్డ బాబు, పాతేపల్లి మాతృశ్రీ సేవ సంస్థ అధ్యక్షులు డాక్టర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బురదమయం.. లింకు రోడ్డు



అర్తమూరు గ్రామంలో బురదమయమైన అర్తమూరు–పెదతుమ్మిడి లింకు రోడ్డు

బంటుమిల్లి: అర్తమూరు–పెదతుమ్మిడి లింకు రోడ్డులోని అర్తమూరు–సాతులూరు గ్రామాల మధ్య రోడ్డు.. ఇటీవల కురుస్తున్న వానలకు బురదమయంగా కనిపిస్తోంది. మండలంలో ఈ రోడ్డు అర్తమూరు–సాతులూరు–చినతుమ్మిడి గ్రామాల మీదుగా పెదతుమ్మిడి వద్ద గుడివాడ రోడ్డులో కలుస్తుంది. ఈ దారి కారణంగా పెడన, ముదినేపల్లి మండలాల్లోని ప్రజలకు జిల్లా కేంద్రం మచిలీపట్నం వెళ్లడానికి దగ్గర దారిగా ఉంటుంది. ఈ స్థితిలో వేసవిలో అర్తమూరు మట్టి మాఫియా అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లతో మట్టి తోలడంతో రోడ్డుపై మట్టి పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదగా తయారైంది. దీంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన తారురోడ్డు తన ఉనికినే కోల్పోయింది. అర్తమూరు గ్రామ పరిధిలో అంతర్గత డ్రెయిన్లు లేక ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపైకి వదలడంతో మురుగు నిలిచిన చోట తటాకాలను తలపిస్తోంది. అధికారులు స్థానికంగా ఉండకపోవడం, ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేక స్థానికులు నీరు నిలిచిన చోట మట్టి తోలుకుని మెరక చేసి నిబంధనలు గాలికి వదిలేశారు. వర్షాలకు తారు రోడ్డు బురద రోడ్డుగా మారడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌లో కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేసి మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని మట్టి ట్రాక్టర్ల కారణంగా రోడ్డు దెబ్బతినకుండ చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



చల్లపల్లి: కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు చేయాలని కోరుతూ జూలై 9వ తేదీన తలపెట్టిన సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా కోరారు. శనివారం మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కార్యదర్శి ఉమకు సమ్మె నోటీసును అందజేశారు. ఈసందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ కనీస వేతనం, గుర్తింపుకార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, దహన సంస్కారాలకు ఆర్థిక సాయం వంటి వాటికి సంబంధించి ఆరేళ్ల క్రితం జారీ చేసిన 132, 142, 680 జీవోలు నేటికీ అమలు కావడం లేదన్నారు. ఈ జీవోల విషయంలో హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కార్మికులు తప్పక హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు మద్దాల శ్రీరాములు, కె.లక్ష్మీ, ఎ.మహాలక్ష్మి, కె.శశి, మట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: పారిశుద్ధ్య కార్మికులు జూలై 9వ తేదీ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో శనివారం నోటీసు అందజేశారు. సంఘ మండల శాఖ కార్యదర్శి రాజశేఖర్, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

చదువుతో పాటు చట్టాలు తెలుసుకోవాలి

మహిళా పీఎస్ సీఐ వెంకటేశ్వరరావు



చట్టాలపై అవగాహన కలిగిస్తున్న సీఐ వాకా వెంకటేశ్వరరావు

కోనేరుసెంటర్: విద్యార్థినులు చదువుతో పాటు చట్టాలపైనా పూర్తి అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ వాకా వెంకటేశ్వరరావు తెలిపారు. మచిలీపట్నంలోని లేడియాంప్తిల్ మహిళా కళాశాలలో శనివారం మహిళలు, చట్టాలు వాటి వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాలికలు విద్యపై దృష్టి పెట్టాలన్నారు. ప్రేమ భావనలు, సోషల్ మీడియాలో మోసపోవడం, బాల్య వివాహాలకు లోనవడం వంటివి వారి జీవితాన్ని ప్రమాదంలోకి నెడతాయన్న విషయాన్ని గ్రహించాలన్నారు. మత్తుపదార్థాలను దూరంగా ఉంచాలన్నారు. బాలికలకు ఎదురయ్యే సైబర్ నేరాలు (చెడ్డ మెసేజులు, ఫొటో మానిప్యులేషన్, ఆన్లైన్ మోసాలు), ఈవ్ టీజింగ్‌తో ఎదురయ్యే మానసిక నష్టం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల సబ్సిడీ విడుదల చేయండి



మాట్లాడుతున్న సదరుద్దీన్‌ఖురేషి, రఫీ

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్ర చేసిన హాజీలకు రావలసిన ప్రభుత్వ సబ్సిడీ నిధులను వెంటనే విడుదల చేయాలని న్యాయవాది, ఈద్గా కమిటీ చైర్మన్ హాజీ ఎండీ రఫీ, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ సదరుద్దీన్ ఖురేషి శనివారం డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024–25 హజ్ యాత్రకు వెళ్లిన హాజీలు పవిత్ర హజ్ యాత్ర పూర్తి చేసుకున్నా ఇంతవరకు ప్రభుత్వం సబ్సిడీ నిధులను జమ చేయకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ముస్లిం సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను ఇంత వరకూ నెరవేర్చకపోవటం చాలా దారుణం అన్నారు. హజ్ హౌస్ నిర్మాణం, 50 ఏళ్లు నిండిన ముస్లింలకు పింఛన్ల మంజూరు, పెద్ద పెద్ద నగరాల్లోని ఈద్గాలకు నిధులు, బరియల్ గ్రౌండ్‌లకు స్థలాల కేటాయింపు, మసీదుల నిర్వహణ నిమిత్తం ప్రతీ నెలా రూ. 5 వేల కేటాయించాలని వారు కోరారు. మైనారిటీ ప్రజాప్రతినిధులు, మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్, మైనారిటీ శాఖ సలహాదారు షరీఫ్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయాలని తెలిపారు.

అధికారులు సమగ్ర నివేదిక అందించాలి

నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు



అధికారులకు సూచనలిస్తున్న సాయిబాబు

కోడూరు: పంచాయతీల్లో అభివృద్ధిని వివరిస్తూ ప్రతి శాఖ అధికారి సమగ్ర నివేదకను ప్రజాప్రతినిధులకు అందించాలని మెప్మా పీడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి శాఖ పరిధిలో జరుగుతున్న పీ–4 లక్ష్యాలపై సాయిబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువులను వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు ఎరువులు, విత్తనాల షాపులను తనిఖీ చేసి నివేదికను సిద్ధం చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే షాపు సీజ్ చేయాలని ఆదేశించారు. ఎస్ఆర్‌జీఎస్ పథకంలో జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల సమన్వయంతో కలిసి ఉపాధి కూలీలకు పని చేయాలని సూచించారు. కౌలు రైతు కార్డుల మంజూరు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. అనంతరం ఆయా శాఖల పని తీరుపై సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీడీఓ సుధాప్రవీణ, పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఏడాదిగా అప్పులతో నడుస్తున్న 'కూటమి' పాలన

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- 5న స్మార్ట్ మీటర్లు పగలగొట్టే కార్యక్రమం విజయవంతం చేయాలి



మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఘంటసాల(అవనిగడ్డ): రాష్ట్రంలో ఏడాదిగా అప్పులతో కూటమి పాలన సాగుతోందని, దేశంలో బీజేపీ మత విద్వేషాలు రగిలిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఘంటసాల మండలం చినకళ్లేపల్లిలో అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి సీపీఐ 25వ మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో రైతులు బ్యాంకులు, సొసైటీల ద్వారా అప్పులు చేసి కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఏడాదిలో సుమారు రూ.లక్ష కోట్లకు పైగా అప్పులతోనే కూటమి పాలన నడుస్తోందని పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఎలా పెడతారు?

గతంలో అదాని కోసం స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని వాటిని పగలకొట్టాలన్న లోకేష్ నేడు మంత్రిగా ఎలా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని రామకృష్ణ ప్రశ్నించారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 5వ తేదీన స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేసి స్మార్ట్ మీటర్లు పగలకొట్టే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఏడాది పాలనలో కూటమి పూర్తిగా విఫలమైందని, ప్రజల తరపున ప్రభుత్వం ఒత్తిడి తెచ్చేందుకు సీపీఐ, సీపీఎం కలసి పోరాటం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.వి.వి.ప్రసాదు, జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, ఇన్స్కాఫ్ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్, నియోజకవర్గ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి పుస్తకాలు, సైకిల్ అందజేత



చల్లపల్లి: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న ఓ పేద విద్యార్థినికి రావెళ్ళ కృష్ణ సేవాసమితి ఆర్థిక సహకారంతో సైకిల్, పాఠ్యపుస్తకాలు శనివారం బహూకరించారు. చల్లపల్లికి చెందిన సైకిల్ మెకానిక్ బాషా కుమార్తె సయ్యద్ సనాఫాతిమా పదిలో 571 మార్కులు సాధించింది. ఇంటర్‌లో ఫ్రీ సీటు తెచ్చుకుంది. ఆమె కాలేజీకి వెళ్లడానికి అనువుగా రూ.7 వేల విలువైన కొత్త సైకిల్‌ను సేవా సమితి చైర్మన్ రావెళ్ళ ఉదయ్‌కుమార్ ప్రోత్సాహకంగా అందజేశారు. ముమ్మనేని సన్ని యూనిఫామ్‌ను అందజేశారు.

మురుగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

మంత్రి కొల్లు రవీంద్ర



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో రూ.165 కోట్ల వ్యయ అంచనాతో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం మురుగు నీటి వ్యవస్థను మెరుగుపరిచి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని రాష్ట్ర గనులు భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని మునిసిపల్ కార్యాలయం పక్కనే 17 వ డివిజన్లో రూ.35.16 లక్షల వ్యయ అంచనాతో నిర్మిస్తున్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో మురుగునీటి వ్యవస్థను బాగుచేయడానికి రూ.165 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆ నిధులు రాగానే సుందరీకరణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, డివిజన్ కార్పొరేటర్ సమతా కీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండండి

బంటుమిల్లి: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ గణేష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పెందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాదక ద్రవ్యాలు, దురలవాట్లు తదితర అంశాలపై విద్యార్థులకు ఎస్ఐ అవగాహన సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన తాగునీటి కోసమే వాటర్‌ప్లాంట్

చినకళ్లేపల్లి(ఘంటసాల): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన తాగునీరందించేందుకు పంచాయతీ సహకారంతో నాంది కమ్యూనిటీ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఘంటసాల మండలం చినకళ్లేపల్లిలో పంచాయతీ సహకారంతో నాంది కమ్యూనిటీ వాటర్ సర్వీస్ ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సర్పంచ్ గుత్తికొండ రామారావు, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, ఎంపీడీవో డి.సుబ్బారావుతో కలసి శనివారం ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన నీటితో పాటు మెరుగైన సేవలందించాలని, 24 గంటలు వాటర్ ప్లాంటు అందుబాటులో ఉంటూ ఏటీఎం కార్డు ద్వారా నీటి సరఫరా జరగడం విశేషమని రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో నాంది వాటర్ ప్లాంట్ ప్రతినిధులు సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్.సురేష్, సీహెచ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ ఏర్పాట్ల పరిశీలన



ఘంటసాలపాలెం(ఘంటసాల): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం చినదళితవాడలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన 11 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను శనివారం దళిత నేతలు పరిశీలించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోవర్ధన్, అంబేడ్కర్ అభిమాని దాసి సీతారామరాజు, దోనె వెంకటేశ్వరరావు, గొరుముచ్చు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ వెంకటేశ్వరుని మాస కల్యాణం

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో ఆదివారం స్వామివార్లకు వేద పండితులు మాస కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు. ఈ కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.